క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

లక్సెట్టిపేట: స్థానిక బీసీ బాలుర వసతిగృహంలోని విద్యార్థులకు వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. 75మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సతీష్, హెచ్ఈవో లక్ష్మణ్‌స్వామి, వార్డెన్ శ్రీహరి, గిరిజశ్రీ, గపూర్, విజదర్శిని పాల్గొన్నారు.

రేపు దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల బస్‌డిపో ఆవరణలో ఈ నెల 10న దివ్యాంగులకు ఉచిత బస్సుపాస్‌లు పంపిణీ చేయనున్నట్లు డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు. మంచిర్యాల మహిళా తరంగిణీ ఆధ్వర్యంలో దివ్యాంగుల బస్సుపాస్‌ల పంపిణీ ఉంటుందన్నారు. మంచిర్యాల మున్సిపాలిటీ, చుట్టుపక్కల ప్రాంత దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగవైకల్యం 40శాతం పైన, మూగ, చెవుడు, కంటి వారికి 100 శాతం ఉండాలన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె విరమణ



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

జైపూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): గ్రామ పంచాయతీ సమస్యలపై గ్రామ పంచాయతీ, ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మల్టీపర్పస్ కార్మికులు 34రోజులుగా చేస్తున్న సమ్మె ఎట్టకేలకు విరమించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హామీతో తమకు న్యాయం జరుగుతుందని, ఈ మేరకు తమ నిరవధిక దీక్ష విరమిస్తున్నట్లు ప్రకటించి మంగళవారం హాజీపూర్ ఎంపీడీఓ అబ్దుల్‌హైకి సమ్మె విరమణ పత్రాన్ని అందజేశారు. జైపూర్‌లో ఎంపీవో అనిల్ కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

'కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం'



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సురేఖ

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందడం, అభివృద్ధి చెందడం జరుగుతుందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో, దేశంలో గెలిపించాలని జిల్లా డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ కోరారు. జిల్లా కేంద్రంలోని 21వ వార్డులో మంగళవారం గడపగడపకూ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీనిచ్చారు.

పరిహారం అందజేత



చెక్కు అందజేస్తున్న సీటీసీ, అధికారులు

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులోని స్టాగ్ కంపెనీలో పని చేస్తూ తాళ్లపల్లి సత్యనారాయణ 2021లో కరోనాతో మృతి చెందగా వారి కుటుంబానికి ప్రభుత్వం ద్వారా మంజూరైన నష్టపరిహారాన్ని మంగళవారం ఎస్టీపీపీ అడ్మిన్ భవనంలో ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ జీఎం బసివిరెడ్డి, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, అధికారులు భూషణ్, ప్రసాద్, సుధాకర్, నారాయణరావు పాల్గొన్నారు.

'పశువులను రోడ్లపైకి వదలొద్దు'

నస్పూర్: పట్టణ పరిధిలోని పశువుల యజమానులు తమ పశువులను రోడ్లపైకి వదలొద్దని మున్సిపల్ కమిషనర్ రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులు పగలు, రాత్రి వేళల్లో రోడ్లపైకి వచ్చి అక్కడే గంటల తరబడి ఉండడం వల్ల, వాహనదారులు ప్రమాదాల పడుతున్నారన్నారు. పశువుల యజమానులు పశువులను రెండు రోజుల్లో తమ ఇళ్లకి తీసుకు వెళ్లనిచో, పశువులను గోశాలలకు తరలించి, పశువుల యజమానులపై తగు చర్యలు తీసుకోబడును నని కమిషనర్ హెచ్చరించారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల వెల్లువ

మంచిర్యాలటౌన్: ఇంటి స్థలం ఉండి ఇల్లులేని వారికి ప్రభుత్వం రూ.3లక్షలను ఇంటి నిర్మాణం కోసం సహాయం అందించేందుకు గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశ పెట్టింది. అయితే ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకే దరఖాస్తులను స్వీకరించడం, అందులోనూ మహిళల పేరిట మాత్రమే ఈ పథకాన్ని వర్తింపజేయడం, సమయం తక్కువగా ఉండడంతో మంచిర్యాల మున్సిపాలిటీలో మంగళవారం పెద్ద సంఖ్యలో దరఖాస్తులను అందించేందుకు ప్రజలు తరలివచ్చారు. మున్సిపల్ కార్యాలయంలోని ఆవరణలో దరఖాస్తులు నింపుతూ, దరఖాస్తుల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ప్రజలు క్యూ కట్టారు. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో 7వ తేదీన 26దరఖాస్తులు రాగా, 8వ తేదీన 237గృహలక్ష్మి దరఖాస్తులు వచ్చాయి.

భీమిని: గృహలక్ష్మి పథకానికి భీమిని, కన్నెపల్లి మండలాల్లో మంగళవారం దరఖాస్తులు భారీగా వచ్చాయి. కన్నెపల్లి మండలంలో 462దరఖాస్తులు రాగా భీమినిలో 171దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ నెల 10వ తేదీలోపు గడువు ఉండటంతో అర్హులైన వారు దరఖాస్తులు చేసుకుంటున్నారు.

జన్నారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకానికి సోమవారం 120, మంగళవారం 500కు పైగా దరఖాస్తులు వచ్చినట్లు రెవెన్యు అధికారులు తెలిపారు. గృహలక్ష్మి విధివిధానాలపై ఇంకా క్లారిటీ లేకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. మహిళల పేరున భూమి ఉండాలని కొందరు చెబుతుంటే, ఇంట్లో ఎవ్వరి పేరున ఉన్నా వర్తిస్తుందని కొందరు చెబుతున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో పట్టాలు లేనందున వారికి ఎలాంటి డాక్యూమెంట్‌లు సమర్పించాల్సి ఉంటుందనేది అయోమయంగా మారింది.



మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో గృహలక్ష్మి దరఖాస్తులను అందజేస్తున్న పట్టణ ప్రజలు

దండేపల్లి: అర్హులైన పేదలకు గృహలక్ష్మి పథకం ద్వారా ఇళ్లు నిర్మిస్తామని ప్రభుత్వం పేర్కొంది. ఇందుకు గాను ఈ నెల 7 నుంచి 10వరకు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పింది. దీంతో దరఖాస్తు చేసుకునేందుకు తక్కువ సమయం ఉండటంతో, జనాలు ఎగబడుతున్నారు. దండేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకునేందుకు జనాలు బారులు తీరారు. సోమవారం 50దరఖాస్తులు రాగా, రెండో రోజు మంగళవారం 448దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సంధ్యారాణి తెలిపారు.



దరఖాస్తు గడువు పెంచాలని డిమాండ్

దండేపల్లి: అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువును పెంచాలని, రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి డిమాండ్ చేశారు. దండేపల్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మద్యం టెండర్లకు పక్షం రోజులు గడువు ఇస్తే, పేదలకు ఇళ్ల మంజూరుకు, దరఖాస్తు చేసుకునేందుకు గృహలక్ష్మి పథకానికి మూడు రోజులు గడువా అని ఎద్దేవా చేశారు. గృహలక్ష్మి దరఖాస్తు గడువును మరికొన్ని రోజు ల వరకు పొడిగించాలన్నారు. అంతేకాకుండా పథకంలోని కొన్ని నిబంధనలు కూ డా ఎత్తివేయాలన్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పాతమంచిర్యాల: గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు పెంచాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలంటే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంక్ ఖాతాలు తీసుకోవడానికే సరిపోతుందని, 3లక్షలు ఇచ్చే పథకం కోసం ప్రజలను ముప్పు తిప్పలు పెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి రమాదేవి, పీవైఎల్ జిల్లా కార్యదర్శి సాజిద్, ఐఎఫ్‌టీయూ నాయకులు సురేష్, రాజలింగు, లింగయ్య తదితరులు ఉన్నారు.

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని చెప్పి, ఇంటి స్థలం ఉన్నవారికి మాత్రమే రూ.3లక్షలు ఇంటి నిర్మాణానికి సాయం చేస్తానని చెప్పి దరఖాస్తుల స్వీకరణకు గడువును కేవలం నాలుగు రోజులు మాత్రమే ఇవ్వడం సరికాదని, ఈ నెల 20వ తేదీ వరకు గడువును పెంచాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ కోరారు. జిల్లా కేంద్రంలోని 25వ వార్డు హనుమాన్‌నగర్‌లో మంగళవారం ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో సొంత స్థలం ఉన్నవారు పెద్ద సంఖ్యలో ఉండగా, జిల్లాకు కేవలం 9,400మాత్రమే ఇస్తున్నారని, జిల్లాకు 30వేల చొప్పున ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

మంచిర్యాలటౌన్: పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిపాలను తాగించాలని, అప్పుడే బిడ్డకు ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రముఖ గైనకాలజిస్టు వైద్యురాలు నల్మాసు శ్రీదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అరసవెల్లి బాలాజి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హనుమాండ్ల రాజిరెడ్డి హాజరు కాగా, 65మంది గర్భిణులకు మంచిర్యాల మహిళా తరంగిణి వారి సహకారంతో సీమంతం చేశారు. ఈ సందర్భంగా గర్భవతులు, బాలింతలు పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తప్పనిసరిగా పాలను పట్టాలని, అప్పుడే బిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఉండి, అనారోగ్య సమస్యలు దరిచేరకుండా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు వెంకటేశ్వర్‌రావు, సుగుణాకర్ రెడ్డి, డేగ బాబు, వార్డు కౌన్సిలర్ చైతన్య రెడ్డి, సీడీపీవో విజయలక్ష్మి, ప్రోగ్రాం చైర్మన్ సత్యపాల్ రెడ్డి, వేలేటి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రామస్వామి, హన్మంతరావు, మధుసూధన్ రెడ్డి, తేజ ప్రసాద్, భాస్కర్‌రెడ్డి, గుండ శ్రీనివాస్, మహేందర్, కిష్టయ్య, ఇందిరా, చందన, సుశీల, తిరుమల, శోభ, పాపమ్మ పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం చేస్తున్న ఐసీడీఎస్, మమత, లయన్స్ సభ్యులు

పోలింగ్ కేంద్రాల తనిఖీ

నస్పూర్: పట్టణ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ పఠాన్ మంగళవారం తనిఖీ చేశారు. సీసీసీ సింగరేణి హై స్కూల్, సింగరేణి ప్రైమరీ స్కూల్, ఆక్స్‌ఫోర్డ్, రేడియంట్, మార్టిన్ గ్రామర్, విలేజ్ నస్పూర్‌లోని జెడ్పీహెచ్ఎస్, ప్రైమరీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్లకు తాగునీరు, విద్యుత్, తదితర అన్ని మౌలిక వసతులు కల్పించాలని తహసీల్దార్ సూచించారు. అనంతరం నస్పూర్ విలేజ్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు.

ఆర్థికసాయం

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న ముల్కల్ల గ్రామానికి చెందిన బొల్లి చందు కుమారులు సృజన్, సనత్‌లను మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఫిలీం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పుస్కూరి రామ్మోహన్‌రావు పరామర్శించారు. ఈ సందర్భంగా పుస్కూర్ ఫౌండేషన్ ద్వారా రూ.20వేల ఆర్థిక సాయం బాధిత కుటుంబానికి అందించారు.

డిమాండ్లు నెరవేర్చాలి

నస్పూర్: బీసీల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని బీసీ సంఘాల ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంగళవారం సీసీసీలోని తెలంగాణ తల్లి విగ్రహానికి సమర్పించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక సంఘాల జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ.. చట్టసభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీ ఫెడరేషన్లకు పాలక మండళ్లు ఏర్పాటు చేసి, నిధులు విడుదల చేయాలని తెలిపారు. బీసీ కార్పొరేషన్‌కు చైర్మన్‌ను నియమించాలన్నారు. ప్రభుత్వ టెండర్లలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఎంబీసీ కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించి నిధులు విడుదల చేయాలని పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

తాండూర్: భవిత కేంద్రాన్ని దివ్యాంగ పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని తాండూర్ ఎంఈవో వాసాల ప్రభాకర్ అన్నారు. 0–18ఏళ్ల వయస్సు కలిగిన దివ్యాంగులకు ప్రతి నెలా ఫిజియోథెరపి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రమాద బీమా చెక్కులు అందజేత

బెల్లంపల్లి: రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం చెందిన బెల్లంపల్లి మండలం రంగపేట గ్రామానికి చెందిన నాగుల లక్ష్మీనారాయణ కుటుంబానికి తంతి తపాలాశాఖ అధికారులు ప్రమాదబీమా చెక్కును అందజేశారు. మాల గురిజాల గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మృతుడు లక్ష్మీనారాయణ భార్య నాగుల మల్లేశ్వరికి ఆదిలాబాద్ డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్, ఐపీపీబీ తెలంగాణ సర్కిల్ చీఫ్ మేనేజర్ భాస్కర్‌నాయక్, ఏఎస్పీ రామారావు, టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ ప్రసాద్ రూ.10లక్షల చెక్కును అందజేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీనారాయణ పోస్టాఫీసులో రూ.399తో ప్రమాద బీమా చేయించినట్లు పోస్టల్ సూపరింటెండెంట్ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు అతడి కుటుంబానికి ప్రమాదబీమాను వర్తింపజేశామని తెలిపారు. గ్రామీణులు ప్రతి ఒక్కరూ బీమా చేయించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాలగురిజాల సర్పంచ్ జీ.అశోక్, ఎంపీటీసీ శకుంతల, ఐపీపీబీ మంచిర్యాల డివిజన్ మేనేజర్ వెంకటేష్, గురిజాల బీపీఎం మేరుగు నారాయణ, సిబ్బంది ,గ్రామస్తులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న తపాలాశాఖ అధికారులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లి గ్రామానికి చెందిన కొరకొప్పుల చంద్రాగౌడ్ అనే వ్యక్తి విద్యుత్ ప్రమాదంలో మృతి చెందగా, అతడి భార్య పుష్పకు మంగళవారం రూ.10లక్షల చెక్కును తపాలాశాఖ అధికారులు అందజేశారు. ఈ సందర్భంగా తపాలాశాఖ ఆదిలాబాద్ సూపరింటెండెంట్ అనిల్ కుమార్ మాట్లాడారు. తపాలాశాఖలో రూ.399లకు ప్రమాద బీమా కింద రూ.10లక్షలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భీమిని శారద, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామారావు, ఐపీపీడీ తెలంగాణ చీఫ్ మేనేజర్ భాస్కర్‌నాయక్, మంచిర్యాల బ్రాంచ్ మేనేజర్ వెంకట్, అసిస్టెంట్ మేనేజర్ సాగర్, చెన్నూర్ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ సాగర్, సిబ్బంది మహేష్, రాజన్న, రమాదేవి, శ్రావణ్ పాల్గొన్నారు.

'అసెంబ్లీ టికెట్ బీసీలకే కేటాయించాలి'

మంచిర్యాలఅర్బన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి మంచిర్యాల నియోజకవర్గ బీసీ అభ్యర్థిగా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావుకు కేటాయించాలని ట్రస్మా నాయకులు డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రైవేట్ విద్యాసంస్థల జేఏసీ కో కన్వీనర్ చంద్రమోహన్‌గౌడ్, ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కస్తూరి పద్మచరణ్, సిద్దయ్య, వెంకటరమణ, మంచి ర్యాల పట్టణ అధ్యక్షుడు ఉస్మాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ విక్రమ్, వివిధ మండలాలకు చెందిన ట్రస్మా అధ్యక్షులు పాల్గొన్నారు.

సన్మానం

చెన్నూర్: పట్టణానికి చెందిన కవి మారెపల్లి వెంకటరమణ పట్టువర్ధన్ ఇటీవల రవీంద్రభారతిలో జరిగిన 'ప్రజా పద్యం' కార్యక్రమంలో 100వ అష్టావధానం పూర్తి చేశారు. అలాగే చెన్నూర్‌కు చెందిన కొమ్మెర దత్తుమూర్తి పంచాంగంలో డాక్టరేట్ సాధించారు. ఇరువురిని 1981–82లో తమతో పాటు 10వ తరగతి చదివిన మిత్రబృందం సభ్యులు మంగళవారం ఘనంగా సన్మానించారు. చారి, మాదాసు కిష్టయ్య, నాందేవ్, మాంతయ్య, వెంకటేశ్వర్, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు వరిసాగుపై అవగాహన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ముల్కల్ల గ్రామ శివారులోని పంట పొలాల్లోని రైతులకు వరిసాగుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి(ఏఓ) మార్గం రజిత రైతుల వ్యవసాయ క్షేత్రాలకు ప్రత్యక్షంగా వెళ్లి, రైతులతో సాగు గురించి మాట్లాడారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

నూతన కమిటీ ఎన్నిక

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 6గని బి రిలే షిఫ్టు నూతన కమిటీని ఎన్నుకున్నారు. గని ఆవరణలో మంగళవారం బి రిలే షిఫ్టు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆర్‌కే 6గని ఏఐటీయూసి ఫిట్ సెక్రటరీ సంఘం సదానందం, ఏరియా నాయకులు గొర్రె నర్సయ్య, చిలిక రాంచందర్, కారుకూరి నగేశ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. షిఫ్టు ఫిట్ కార్యదర్శిగా అల్లూరి దుర్గయ్య, సహాయ కార్యదర్శిగా దాసరి లవకుమార్, ఆర్గనైజర్లుగా నూనె రాజయ్య, జనగామ రవి, కోశాధికారిగా శాతం సంపత్, పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో మంగళవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. 9వ వార్డు పాతమంచిర్యాలలో సాయిబాబా ఆలయం నుంచి రంగంపేట వరకు రూ. 2.80కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం రూ.55లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు భూమిపూజ చేయగా, 27వ వార్డులో డీఎంఎఫ్‌టీ నిధులు రూ.45లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వార్డు కౌన్సిలర్లు బొలిశెట్టి సునిత, సిరికొండ పద్మ, బీఆర్‌ఎస్ యువనాయకులు నడిపెల్లి విజిత్‌రావు, నాయకులు ఎర్రం తిరుపతి, బొలిశెట్టి కిషన్, కొండల్‌రావు, నాయకులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మెగా హెల్త్‌క్యాంప్ పోస్టర్ ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్: పట్టణంలోని మెడిలైఫ్‌లో ఈ నెల 13వ తేదీన గొంగళ్ల శంకర్ మిత్రబృందం ఆధ్వర్యంలో చేపట్టనున్న మెగా హెల్త్‌క్యాంప్ ప్రచార పోస్టర్లను మంగళవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు తన నివాసంలో ఆవిష్కరించారు. హైదరాబాద్ వంటి నగరాల్లో చేసుకునే వైద్య పరీక్షలను మంచిర్యాలలోనే నిర్వహిస్తున్నామని, హెల్త్ క్యాంపులో గుండె, చాతి, నరాలు, ఎముకలు, కిడ్నీ, గైనకాలజిస్టు, కాలేయ తదితర సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్యాంపునకు ముందు రోజునే 9120108108, 81210 81080నంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

కార్మికులకు అత్యాధునిక వైద్య సేవలు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని కార్మికులకు, ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. ఆర్‌కే 8 డిస్పెన్సరీ వద్ద రెండు నూతన అంబులెన్సులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగుల, కార్మికుల వైద్యానికి కావాల్సిన అన్ని మౌలిక వసతుల కల్పన, అత్యాధునిక వైద్య పరికరాలను సమకూరుస్తున్నామని తెలిపారు. అంబులెన్సులలో ఆక్సిజన్ సిలిండర్, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, స్ట్రేచర్ కలిగి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో డీవైసీఎంఓ డాక్టర్ రమేశ్‌బాబు, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డాక్టర్ వేదవ్యాసు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



అంబులెన్స్‌లు ప్రారంభిస్తున్న జీఎం సంజీవరెడ్డి

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన

మందమర్రిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే చెల్లించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో కలిసి మంగళవారం నిరసన చేపట్టారు.



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

షాదీఖానా స్థలం స్వాధీనం చేసుకోవాలి

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని షంషీర్‌నగర్‌లో ఉన్న షాదీఖానా స్థలం రోజురోజుకు దురాక్రమణకు గురవుతోందని, వెంటనే ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆల్ ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు మంగళవారం వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి షాదీఖానా స్థలాన్ని కబ్జా చేస్తున్నారని తెలిపారు. భూ ఆక్రమణల నివారణకు చర్యలు తీసుకుని, షాదీఖానా స్థలం ఆక్రమణ కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆల్ ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు అన్వర్‌ఖాన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అమానుల్లాఖాన్, పట్టణ అధ్యక్షుడు రసూల్‌షరీఫ్, యూత్ అధ్యక్షుడు ఫెరోజ్‌ఖాన్, గౌస్, అఫ్జల్ బాబా తదితరులు పాల్గొన్నారు.



డీటీ ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న మైనార్టీ నాయకులు

గద్దర్ మృతి ప్రజలకు తీరని లోటు

పాతమంచిర్యాల: ప్రజాగాయకుడు గద్దర్ మరణం తెలంగాణ ప్రజలకు తీరని లోటు అని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద మంగళవారం గద్దర్‌కు నివాళులర్పించి సంతాపం ప్రకటించారు. అణగారిన వర్గాల ఆశాకిరణం గద్దర్ అని జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో గద్దర్ సంతాప సభ ఏర్పాటు చేసి, గద్దర్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పురుషోత్తం, సుధాకర్, సుధీర్, కనకరాజు, అశోక్ తేజ, రామ్మూర్తి, రాజేష్, కుమార్, రామన్న, శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, ప్రవీణ్, నితీష్, స్వామి, వంశీ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: గద్దర్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఆర్‌కే1ఏ గనితో పాటు ఆయా డిపార్ట్‌మెంట్లపై గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యూనియన్ బ్రాంచి కార్యదర్శి అక్బర్‌అలీ, ఇప్పకాయల లింగయ్య, గోవిందుల రమేష్, అంజనేయులు, రాజేశ్వర్‌రావు, సురమల్ల వినయ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



కేకే-5 గనిపై గద్దర్ చిత్రపటం వద్ద నివాళులు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని పలు గనులు ఆయా డిపార్టుమెంటులలో మంగళవారం గద్దర్‌కు నివాళి అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కుల రాజేశం, కోల్‌బెల్ట్ సీనియర్ రిపోర్టర్ ఎండీ మునీర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, నాయకులు అన్నయ్య, పలువురు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: గద్దర్ మృతిపై మంగళవారం ఏరియాలోని గనులపై నాయకులు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేకే –5 గని వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య హాజరై గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు సత్యనారాయణ, సుదర్శన్, శ్రీనివాస్ ఉన్నారు.

డ్రెయినేజీల్లో పూడిక తీత

బెల్లంపల్లి: మున్సిపాలిటీలోని మురుగునీటి కాలువల్లో మంగళవారం పలు చోట్ల పూడికతీత పనులు జరిగాయి. 8వ వార్డులో ఉన్న కాలువల్లో జేసీబీతో పూడిక తీయించి మురికినీటి పారుదల సౌకర్యాలను మెరుగుపర్చారు. 8వార్డు శాంతిఖని బస్తీలో ఉన్న సల్లేజ్ డ్రెయినేజీలో పూడికతీత పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, కమిషనర్ సమ్మయ్య పర్యవేక్షించారు. 18వార్డు పరిధిలో పబ్లిక్ టాయిలెట్ పక్కన ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. మురుగుదొడ్లను సిబ్బందితో క్లీన్ చేయించారు. 31వార్డు పరిధిలోని సల్లేజ్ డ్రెయినేజీలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేశారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కౌన్సిలర్, గెల్లి రాజలింగు, పర్యావరణ ఇంజనీర్ సంతోష్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌స్పెక్టర్ సునీల్, బీఆర్ఎస్ నాయకులు జిలకర వాసు, సముద్రాల మురళీ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.